నాగల్ నయా చరిత్ర

తొలి రౌండ్‌లో 38వ ర్యాంకర్ ఖేల్ ఖతం • రెండో రౌండ్‌కు చేరిన తొలి భారత ఆటగాడిగా రికార్డు

మాంటెకార్లో: గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్న భారత టెన్నిస్ సంచలనం సుమిత్ నాగల్ మరో అద్భుత ప్రదర్శనతో చరిత్ర సృష్టించాడు. ఫ్రాన్స్‌లోని మాంటెకార్లో వేదికగా జరుగుతున్న ఏటీపీ మాంటెకార్లో మాస్టర్స్ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో నాగల్ 5-7, 6-2, 6-4 తేడాతో ఇటలీకి చెందిన 38వ ర్యాంకర్ మాటియో ఆర్నాల్డీని చిత్తు చేశాడు. తన కంటే మెరుగైన ర్యాంకులో ఉన్న ప్రత్యర్థితో ఆడిన నాగల్.. మాటియోతో తొలి సెట్‌లో హోరాహోరీ పోరాడినా ప్రత్యర్థిదే పైచేయి అయింది. కానీ రెండో సెట్‌లో బలంగా పుంజుకున్న 95వ ర్యాంకర్ అయిన నాగల్.. అదే జోరును మూడో సెట్‌లోనూ కొనసాగించి ఈ టోర్నీలో రెండో రౌండ్ ఆడనున్న తొలి భారత ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. ప్రిక్వార్టర్స్‌లో అతడు ప్రపంచ ఏడో ర్యాంకర్ హోల్జర్ రున్ (డెన్మార్క్)తో తలపడతాడు. మాంటె కార్లో క్వాలిఫయింగ్ రౌండ్‌లో 55వ ర్యాంక్‌లో ఉన్న ఫాకుండో (అర్జెంటీనా) ను ఓడించి 42 ఏండ్ల తర్వాత ఈ టోర్నీలో ఆడే అవకాశం దక్కించుకున్న తొలి భారతీయుడిగా నిలిచిన నాగల్.. తాజాగా టాప్-50 లోపు ఉన్న మరో ప్లేయర్‌కు షాకివ్వడం గమనార్హం. ఈ ఏడాది ఆరంభ సీజన్ ఆస్ట్రేలియా ఓపెన్‌లో ప్రపంచ 27వ ర్యాంకర్ అలెగ్జాండర్ బల్బిక్‌ను ఓడించిన నాగల్.. తాజాగా మరో అగ్రశ్రేణి ఆటగాడిని మట్టికరిపించడం విశేషం. ఈ విజయం ద్వారా నాగల్ తన కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంకింగ్ (80)కు ఎగబాకనున్నాడు.

సోషల్ మీడియాలో మయాంక్ తుఫాన్!

లక్నో : ఐపీఎల్ తాజా సంచలనం, ఈ సీజన్‌లో ఆడిన మూడు మ్యాచ్‌లతోనే తనదైన వేగంతో పాటు వైవిధ్యమైన బౌలింగ్‌తో భావి భారత సూపర్ స్టార్‌గా ప్రశంసలు అందుకుంటున్న లక్నో పేసర్ మయాంక్ యాదవ్ సోషల్ మీడియాలో తుఫాన్ సృష్టిస్తున్నాడు. నిలకడగా 150+ వేగంతో బంతులు విసురుతున్న ఈ ఢిల్లీ కుర్రాడికి సామాజిక మాధ్యమాల్లోనూ క్రేజ్ పెరుగుతోంది. ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన పది రోజుల్లోనే అతడి ఫాలోవర్ల సంఖ్య మయాంక్ విసిరిన బంతుల కంటే రెట్టింపు వేగంతో దూసుకుపోతోంది. మార్చి 30న ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చేనాటికి ఇన్‌స్టాగ్రామ్‌లో మయాంక్‌ను ఫాలో అయ్యేవారి సంఖ్య 4,570 గా ఉండగా ఏప్రిల్ 8వ తేదీకి ఆ సంఖ్య 4లక్ష ల48వేల (4,48,822)కు పెరిగింది. ఈ నెల 2 నుంచి 5 మధ్యలో అతడి ఫాలోవర్ల సంఖ్య ఏకంగా 2.26 లక్షలు పెరగడం గమనార్హం. పది రోజుల వ్యవధిలో మయాంక్ పంజాబ్‌తో మ్యాచ్‌లో మూడు వికెట్లు తీయగా బెంగళూరుతోనూ అదే ఫీట్ రిపీట్ చేశాడు.

విజయాల్లో ముంబై ప్రపంచ రికార్డు

ముంబై : ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటిగా ఉన్న ముంబై ఇండియన్స్(ఎంఐ) పొట్టి క్రికెట్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఆదివారం వాంఖడే వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ గెలిచిన ముంబైకి టీ20 ఫార్మాట్‌లో ఇది 150వ విజయం. తద్వారా 20 ఓవర్ల క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా ఎంఐ కొత్త చరిత్ర సృష్టించింది. ఐపీఎల్‌తో పాటు చాంపియన్స్ టీ20 లీగ్ టోర్నీలలో కలుపుకుని ముంబై.. 273 మ్యాచ్‌లు ఆడి 150 గెలిచి 117 మ్యాచ్‌లలో ఓడింది. రెండు మ్యాచ్‌లలో ఫలితం తేలలేదు. సూపర్ ఓవర్‌లలో ముంబై రెండింట్లో గెలిచి రెండు మ్యాచ్‌లలో ఓడింది. వాటిని విజయాలలో పరిగణనలోకి తీసుకోకుండానే 150 మ్యాచ్‌లను గెలుచుకుంది. ముంబై తర్వాత ఈ రికార్డు చెన్నై పేరిట (148) ఉంది. వాంఖడేలో ముంబైకి ఇది 50వ గెలుపు. ఐపీఎల్‌లో మరే జట్టుకూ సొంత మైదానంలో ఇలాంటి రికార్డు లేదు.

బ్రూక్ స్థానంలో విలియమ్స్

ఢిల్లీ: వ్యక్తిగత కారణాలతో ఐపీఎల్-17కు దూరమైన ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ స్థానాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ భర్తీ చేసింది. దక్షిణాఫ్రికా పేసర్ లిజాడ్ విలియమ్స్ ఐపీఎల్‌లో తొలి సీజన్ ఆడనున్నాడు. మూడేండ్ల క్రితం సఫారీ టీమ్‌లోకి వచ్చిన విలియమ్స్ ఇప్పటి వరకూ రెండు టెస్టులు, మూడు వన్డేలు, 11 టీ20లు ఆడి 24 వికెట్లు పడగొట్టాడు. రూ.50 లక్షల కనీస ధరతో అతడు ఢిల్లీకి ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సీజన్‌లో 5 మ్యాచ్‌లు ఆడిన ఢిల్లీ పాయింట్ల పట్టికలో చిట్టచివరి స్థానంలో ఉంది.

కరువానతో గుకేశ్ గేమ్ డ్రా

• క్యాండిడేట్స్ చెస్ టోర్నీ

టొరంటో: ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో అమెరికా టాప్‌సీడ్ ప్లేయర్ ఫాబియానో కరువానను భారత యువ గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ అద్భుతంగా నిలువరించాడు. సోమవారం జరిగిన పురుషుల నాలుగో రౌండ్‌లో ఫాబియానోతో గేమ్‌ను గుకేశ్ డ్రా చేసుకున్నాడు. ఈ ఇద్దరి మధ్య ఆఖరి వరకు ఆసక్తికరమైన పోరు జరిగింది. విదిత్ గుజరాతి..ఇయాన్ తిలో ఓడగా, నకాముర తో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. మహిళల విభాగంలో వైశాలి..అలెగ్జాండ్రతో గేమ్‌తో డ్రా చేసుకుంది.

ముల్లాన్‌పూర్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు ఆపండి!

చండీగఢ్: ఐపీఎల్-17 సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు హోంగ్రౌండ్‌గా ఉన్న ముల్లాన్‌పూర్ స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణను అడ్డుకోవాలని పంజాబ్ అండ్ హర్యానా కోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలైంది. అవసరమైన పర్యావరణ అనుమతులు తీసుకోకుండానే ఈ స్టేడియాన్ని నిర్మించారని ఆరోపిస్తూ పంజాబ్ యూనివర్సిటీ న్యాయ విద్యార్థి నిఖిల్ పిటిషన్ వేశాడు. చండీగఢ్‌లోని సెక్టార్-21లో గల పక్షుల అభయారణ్యానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ మైదానం.. నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్ (ఎన్‌బీడబ్ల్యూఎల్) అనుమతులు తీసుకోకుండానే నిర్మితమైనట్టు పిల్‌లో పేర్కొన్నాడు.

కేకేఆర్ బ్రేక్

రుతురాజ్ కెప్టెన్ ఇన్నింగ్స్ విజయాల బాట పట్టిన చెన్నై

జడ్డూ జాదూగర్‌కు కోల్‌కతా బేజార్

జడేజా (3/18)

హ్యాట్రిక్ విజయాలతో దూకుడు మీదున్న కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జోరుకు డిఫెండింగ్ చాంపియన్స్ చెన్నై సూపర్‌కింగ్స్ (సీఎస్‌కే) బ్రేక్ వేసింది. చెన్నైలోని చెపాక్ స్టేడియంలో కేకేఆర్‌ను ముందు బంతితో కట్టడి చేసిన చెన్నై.. ఆపై బ్యాట్‌తోనూ రాణించి రెండు పరాజయాల తర్వాత మళ్లీ విజయాల బాట పట్టింది. రవీంద్ర జడేజా స్పిన్ మాయాజాలానికి తోడు తుషార్ దేశ్‌పాండే, ముస్తాఫిజుర్ రెహ్మాన్ పేస్‌కు కేకేఆర్ బ్యాటింగ్ ఆర్డర్ విఫలమైంది. సీఎస్‌కే బౌలర్లు వికెట్ల పండుగ చేసుకున్న పిచ్‌పై కోల్‌కతా బౌలర్లు తేలిపోయారు. రుతురాజ్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు.

రుతురాజ్ (67*)

చెన్నై : ఐపీఎల్-17లో రెండు పరాజయాల తర్వాత చెన్నై మళ్లీ విజయాల బాట పట్టింది. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. పూర్తి ఏకపక్షంగా సాగిన పోరులో 7 వికెట్ల తేడాతో కేకేఆర్‌ను చిత్తుచేసింది. జడేజా (3/18) స్పిన్‌తో కేకేఆర్ టాపార్డర్‌ను బుట్టలో వేసుకోగా తుషార్ (3/33), ముస్తాఫిజుర్ (2/22) కట్టడిచేయడంతో మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 137 పరుగులే చేసింది. అనంతరం ఛేదనను సీఎస్‌కే ఆడుతూ పాడుతూ 17.4 ఓవర్లలో141/3 స్కోరు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (58 బంతుల్లో 67 నాటౌట్, 9 ఫోర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. జడేజాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

నరైన్, రఘువంశీ దంచినా..

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన కేకేఆర్‌కు తొలి బంతికే తుషార్ షాక్ ఇచ్చాడు. తొలి ఓవర్ మొదటి బంతికే ఫిల్ సాల్ట్‌ను ఔట్ చేసి వికెట్ల పతనానికి శ్రీకారం చుట్టాడు. కానీ ఈ సీజన్‌లో అంచనాలకు మించి రాణిస్తున్న నరైన్.. తుషార్ వేసిన 3వ ఓవర్లో రెండు బౌండరీలు, ఓ సిక్సర్ సాయంతో 19 పరుగులు రాబట్టి కేకేఆర్ స్కోరు వేగాన్ని పెంచాడు. మరో ఎండ్‌లో కొత్త కుర్రాడు అంగ్‌క్రిష్ రఘువంశీ (24) సైతం మెరుపులు మెరిపించాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు 36 బంతుల్లోనే 56 పరుగులు జతచేసింది.

జడ్డూ మాయ..

పవర్ ప్లే ముగిసేటప్పటికీ కేకేఆర్ స్కోరు 56-1. కానీ జడేజా రాకతో కోల్‌కతాకు వరుస కష్టాలు చుట్టుముట్టాయి. జడ్డూ తన తొలి బంతికే రఘువంశీని వికెట్ల ముందు దొరకబుచ్చుకోగా అదే ఓవర్లో ఐదో బంతికి నరైన్.. లాంగాఫ్ వద్ద తీక్షణ చేతికి చిక్కాడు. తన తర్వాతి ఓవర్లో జడ్డూ.. వెంకటేశ్ అయ్యర్ (3) పని పట్టాడు. 12 బంతుల వ్యవధిలో కేకేఆర్ మూడు కీలక వికెట్లు కోల్పోవడంతో కోలుకోలేకోయింది. ఆ జట్టు భారీ ఆశలు పెట్టుకున్న రింకూ సింగ్ (9)తో పాటు ప్రమాదకర ఆండ్రీ రస్సెల్ (10)నూ తుషార్ పెవిలియన్‌కు చేర్చాడు. తొలి ఐదు ఓవర్లలో 50/1 స్కోరు చేసిన కేకేఆర్.. ఆ తర్వాత 15 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 87 పరుగులు మాత్రమే చేసింది.

రుతురాజ్ కెప్టెన్ ఇన్నింగ్స్..

ఛేదనలో చెన్నై కూడా ఆరంభంలో ఆచితూచి ఆడింది. స్టార్క్ వేసిన మూడో ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన రచిన్ రవీంద్ర (15) నాలుగో ఓవర్ వేసిన వైభవ్ బౌలింగ్‌లో చక్రవర్తికి క్యాచ్ మరోసారి నిరాశపరిచాడు. కెప్టెన్ గైక్వాడ్ మాత్రం పట్టుదలతో బ్యాటింగ్ చేశాడు. 45 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. మరో ఎండ్‌లో మిచెల్..క్లీన్‌బౌల్డ్ అయినా శివమ్ దూబే మెరుపులతో చెన్నై అలవోక విజయాన్ని అందుకుంది. దూబే ఔట్ అయ్యాక ధోనీ క్రీజులోకి వచ్చి అభిమానులను సంతోషంలో ముంచెత్తాడు.

సంక్షిప్త స్కోర్లు

కోల్‌కతా : 20 ఓవర్లలో 137/9 (శ్రేయస్ 34, నరైన్ 27, జడేజా 3/18, తుషార్ 3/33) **చెన్నై :** 17.4 ఓవర్లలో 141/3 (రుతురాజ్ 67 నాటౌట్, దూబే 28, వైభవ్ 2/28, నరైన్ 1/30)

భారత హాకీ శిబిరానికి జ్యోతి

చోటు దక్కించుకున్న తెలంగాణ యువ ప్లేయర్

బెంగళూరు: భారత హాకీ జట్టు జాతీయ శిబిరానికి తెలంగాణ యువ ప్లేయర్ జ్యోతిరెడ్డి ఎంపికైంది. రానున్న ఎఫ్ ఐహెచ్ ప్రొ లీగ్ టోర్నీల కోసం హాకీ ఇండియా (హెచ్ఐ) సోమవారం 33 మందితో ప్రాబబుల్స్‌ను ప్రకటించింది. ఇందు లో సవితా పునియా, వందన కటారియా లాంటి స్టార్ ప్లేయర్లతో పాటు ఇటీవల జాతీయ హాకీ టోర్నీలో రాణించిన మిడ్‌ఫీల్డర్ జ్యోతి, మరినా లాల్‌రామ్‌గ్కి, మాధురి కిండో, రోప్ని కుమారి, ప్రీతి, దీపిక సోరెంగ్, రుతుజ ప్రాబబుల్స్‌లో చోటు దక్కించుకున్నారు. వీరంతా మే 16 వరకు జాతీ క్యాంప్‌లో శిక్షణ పొందుతారు. అటు తర్వాత 22నుంచి మొదలయ్యే ఎఫ్ ఐహెచ్ సిరీస్‌లలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు.

ప్రిక్వార్టర్స్‌లో కార్తీక్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నగరంలోని స్థానిక ఫిల్మ్‌నగర్ క్లబ్ వేదికగా జరుగుతున్న ఆల్ ఇండియా జాతీయ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీలో సాయికార్తీక్‌రెడ్డి ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు. సోమవారం జరిగిన మ్యాచ్‌లో కార్తీక్ 6-4, 7-5తో రెండో సీడ్ నీరజ్ యశ్‌పాల్ (ఢిల్లీ)పై అలవోక విజయం సాధించాడు.

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	4	4	0	1.12	8
కోల్‌కతా	4	3	1	1.52	6
లక్నో	4	3	1	0.77	6
చెన్నై	5	3	2	+0.66	6
హైదరాబాద్	4	2	2	+0.40	4
పంజాబ్	4	2	2	-0.22	4
గుజరాత్	5	2	3	-0.79	4
ముంబై	4	1	3	-0.70	2
బెంగళూరు	5	1	4	-0.84	2
ఢిల్లీ	5	1	4	-1.37	2

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

హాట్.. హాట్ రికార్డులు

సరికొత్త స్థాయికి స్టాక్ మార్కెట్లు • ఆల్‌టైమ్ హైకి సెన్సెక్స్, నిఫ్టీ • కొనుగోళ్ల జోష్‌లో మదుపరులు

ముంబై, ఏప్రిల్ 8: హాట్.. హాట్ సమ్మర్‌ను దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డు గరిష్ఠాలతో మరింత హీటెక్కించాయి. సోమవారం అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సరికొత్త స్థాయిలను అధిరోహించాయి. మదుపరులు పెట్టుబడులకు పెద్దపీట వేయడంతో ఉదయం ఆరంభం నుంచే రికార్డుల మోత మోగింది. ఈ క్రమంలోనే గత ఇంట్రా-డే హై, క్లోజింగ్ హై రికార్డులు బద్దలై కొత్తవి నమోదయ్యాయి. సెన్సెక్స్ ఒకానొక దశలో 621.08 పాయింట్లు ఎగిసి తొలిసారి 74,869.30 స్థాయిని తాకింది. ఇదే సమయంలో నిఫ్టీ కూడా 183.60 పాయింట్లు ఎగబాకి మొదటిసారి 22,697.30 స్థాయిని చేరింది. రెండు సూచీలకూ ఇవే ఆల్‌టైమ్ ఇంట్రా-డే హై. కానీ ఆఖర్లో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడంతో ఈ ఉత్సాహం కాస్త చల్లబడింది. అయినప్పటికీ ఆల్‌టైమ్ క్లోజింగ్ హైల్లోనే సూచీలు స్థిరపడ్డాయి. సెన్సెక్స్ 494.28 పాయింట్లు లేదా 0.67 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 74,742.50 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 152.60 పాయింట్లు లేదా 0.68 శాతం పుంజుకొని గతంలో ఎప్పుడూ లేనట్టుగా 22,666.30 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం కలిసొచ్చాయని నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. ఇక హెవీ వెయిట్ షేర్ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు కొనుగోలుదారుల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. అలాగే మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్టీపీసీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్‌అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్ షేర్లు మెరిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.26 శాతం, స్మాల్‌క్యాప్ 0.06 శాతం పెరిగాయి. రంగాలవారీగా ఆటో, ఆయిల్-గ్యాస్, ఎనర్జీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, రియల్టీ, మెటల్, యుటిలిటీస్ షేర్లు 1.65 శాతం నుంచి 0.90 శాతం మేర పెరిగాయి.

గ్లోబల్ మార్కెట్లలో

ప్రధాన ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ముగిశాయి. చైనా మాత్రం నష్టపోయింది. ఐరోపా మార్కెట్ల లోనూ కీలక సూచీలైన జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ లాభాల్లోనే ట్రేడ్ అవుతున్నాయి. ఇక అమెరికా స్టాక్ మార్కెట్లు గత వారాన్ని లాభాలతో ముగించిన విషయం తెలిసిందే. కాగా, విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) శుక్రవారం రూ.1,659.27 కోట్ల పెట్టుబడుల్ని భారతీయ ఈక్విటీ మార్కెట్లలోకి తీసుకొచ్చారు.



400 లక్షల కోట్లపైకి..

బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ తొలిసారి రూ.400 లక్షల కోట్ల ఎగువన ముగిసింది. గత ఏడాది జూలైలో రూ.300 లక్షల కోట్ల మార్కును తాకిన విషయం తెలిసిందే. కేవలం 9 నెలల్లోనే మదుపరుల సంపద రూ.100 లక్షల కోట్లు ఎగబాకడం గమనార్హం. సుమారు తొమ్మిదిన్నరేండ్ల క్రితం మొదటిసారి రూ.100 లక్షల కోట్ల మార్కును దాటింది. ఆ తర్వాత ఆరేండ్లకు రూ.200 లక్షల కోట్లను చేరింది. అయితే రూ.200 లక్షల కోట్ల నుంచి రూ.300 లక్షల కోట్లను చేరడానికి రమారమీ రెండున్నరేండ్లే పట్టింది.



వాణిజ్య

బజాజ్ ఫైనాన్స్ ఎఫ్‌డీలపై వడ్డీ పెంపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేటును 60 బేసిస్ పాయింట్ల వరకు పెంచుతున్నట్లు బజాజ్ ఫైనాన్స్. ప్రకటించింది. 25-35 నెలల కాలపరిమితితో సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై వడ్డీరేటును 60 బేసిస్ పాయింట్ల వరకు సవరించిన సంస్థ... అలాగే 18-24 నెలల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై రేటును 40 బేసిస్ పాయింట్ల వరకు పెంచింది. దీంతోపాటు సీనియేతర సిటిజన్ల డిపాజిట్లపై వడ్డీరేటును 45 బేసిస్ పాయింట్ల వరకు సవరించింది.

చమురుకు పెరిగిన డిమాండ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: దేశవ్యాప్తంగా చమురుకు డిమాండ్ అంతకంతకు పెరుగుతున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 233.276 మిలియన్ టన్నుల డిమాండ్ నెలకొన్నది. అంతక్రితం ఏడాది 223.021 మిలియన్ టన్నుల కంటే ఇది 5 శాతం వరకు అధికం. కానీ, గతేడాది చివరి నెల మార్చిలో మాత్రం డిమాండ్ ఏడాది ప్రాతిపదికన 0.6 శాతం తగ్గి 21.09 మిలియన్ టన్నులకు పడిపోయింది. వాహన అమ్మకాలు భారీగా పెరగడం ఇందుకు కారణమని పీపీఏసీ వెల్లడించింది.

పసిడి పరుగో..పరుగు

రికార్డు స్థాయికి చేరుకున్న ధర

2024లో రూ.7,700 పెరిగిన విలువ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:బంగారం పరుగులు పెట్టింది. ఢిల్లీలో తులం బంగారం ధర మరో రూ.350 పెరిగి రూ.71,700కి చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలపై పెట్టుబడులు పెట్టేవారు అధికంగా ఉండటంతో దేశీయంగా రోజుకొక రికార్డును అధిగమిస్తున్నది. అంతకుముందు గరిష్ఠ స్థాయి రూ.71,350 పలికిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఏడాదిలో తులం బంగారం ధర రూ.7,700 పెరిగినట్లు అయింది. గడిచిన నాలుగు నెలలుగా పెరుగుతూనే ఉన్నట్లు ఆభరణాల వర్తకులు వెల్లడిస్తున్నారు. బంగారంతోపాటు వెండి మరో శిఖరంపైన కూర్చున్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి రూ.800 అందుకొని రూ.84 వేలు పలికింది. ఇటు హైదరాబాద్‌లోనూ 22 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.300 అధికమై రూ.65,650 పలుకగా, 24 క్యారె ధర రూ.330 అందుకొని రూ.71,620కి చేరుకున్నది. అలాగే కిలో వెండి రూ.1,000 పెరిగి రూ.88 వేలకు ఎగబాకింది.

సింగిల్ జీఎస్టీ రేటుండాలి

13వ ఆర్థిక సంఘం చైర్మన్ విజయ్ కేల్కర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో నెలకొన్న అనవసరపు సంక్లిష్టతను రాబోయే కొత్త ప్రభుత్వం తక్షణమే తొలగించాల్సిన అవసరం ఉందని ప్రముఖ ఆర్థికవేత్త, 13వ ఆర్థిక సంఘం చైర్మన్ విజయ్ కేల్కర్ అన్నారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న క్రమంలో సరళతరమైన జీఎస్టీపై కేంద్ర ప్రభుత్వం వెంటనే దృష్టి పెట్టాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. 12 శాతం సింగిల్ ట్యాక్స్ రేటు ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వాలు, మున్సిపల్ కార్పొరేషన్లతో జీఎస్టీ ఆదాయాన్ని కేంద్రం పంచుకోవాలని సూచించారు.

120 కోట్లకు టెలికం సబ్‌స్క్రైబర్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: దేశవ్యాప్తంగా టెలికం సబ్‌స్క్రైబర్లు మరింత పెరిగారు. ఫిబ్రవరి చివరినాటికి ఈ సంఖ్య 119.7 కోట్లకు చేరుకున్నట్లు ట్రాయ్ వెల్లడించింది. వీరిలో అర్బన్ టెలిఫోన్ సబ్‌స్క్రైబర్లు 66.37 కోట్లకు చేరుకోగా, రూరల్ సబ్‌స్క్రైబర్లు 53.13 కోట్లకు చేరుకున్నారు. అలాగే బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్లు 91.10 కోట్ల నుంచి 91.67 కోట్లకు పెరిగారని తన నెల సమీక్షలో తెలిపింది. మొత్తం బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్లలో టాప్-5 సంస్థల వాటా 98.35 శాతంగా ఉన్నది.

సెలెక్ట్‌లో ఉగాది ఆఫర్లు

హైదరాబాద్, ఏప్రిల్ 8: ప్రముఖ మొబైల్ రిటైల్ దిగ్గజాల్లో ఒకటైన సెలెక్ట్..ఉగాది పండుగను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. 'ఉగాది ఆఫర్ల వర్షం' అనే నినాదంతో ప్రకటించిన ఈ ఆఫర్లలో 7.5 శాతం నుంచి 75 శాతం వరకు తగ్గింపు ధరకు మొబైళ్లను విక్రయిస్తున్నట్లు కంపెనీ సీఎండీ వై గురు తెలిపారు. ఈ ఆఫర్లు స్మార్ట్‌ఫోన్ల తోపాటు టీవీ, ల్యాప్‌టాప్, విడిభాగాలకు కూడా వర్తిస్తున్నదన్నారు. వీటితోపాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్డుపై 7.5 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్, ఎల్‌ఈడీ స్మార్ట్ టీవీ అండ్ సౌండ్ బార్ కాంబోను రూ.11,999కే, బ్రాండెడ్ యాక్సరీస్‌పై 75 శాతం వరకు డిస్కౌంట్, బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలుపై రూ.4 వేలు ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్, బ్రాండెడ్ యాక్సరీస్ కాంబోస్ రూ.899 నుంచి లభించనున్నాయని చెప్పారు.

ఫ్లిప్‌కార్ట్‌లో బస్ టికెట్ బుకింగ్

బెంగళూరు, ఏప్రిల్ 8: డిజిటల్ కామర్స్ సేవల సంస్థ ఫ్లిప్‌కార్ట్..తాజాగా బస్ టికెట్ బుకింగ్ సేవలను ప్రారంభించింది. ఇందుకోసం సంస్థ రాష్ట్ర రవాణ కార్పొరేషన్లు, ప్రైవేట్ అగ్రిగేటర్లతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ప్రస్తుతానికి బెంగళూరు, ఛండీగఢ్, ఢిల్లీ, జైపూర్, ఇండోర్, అహ్మదాబాద్, హైదరాబాద్, ముంబై, చెన్నైలలో ఈ టికెట్ బుకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎలాంటి చార్జిలు లేకుండా బస్ టికెట్‌ను బుకింగ్ చేసుకోవచ్చునని సూచించింది. అలాగే ఈ నూతన సేవలు ప్రారంభ సందర్భంగా ఈ నెల 15 వరకు 20 శాతం వరకు రాయితీని కల్పించింది. దేశవ్యాప్తంగా 25 వేలకు పైగా రూట్లలో 10 లక్షలకు పైగా బస్సులకు సంబంధించిన టికెట్ బుకింగ్ సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇప్పటికే విమాన టికెట్, హోటల్ బుకింగ్ సేవలను ఆరంభించిన విషయం తెలిసిందే.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd